క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు ఇలా.. టమాట రూ.13, వంకాయ 45, బెండ 28, పచ్చి మిర్చి 35, కాకర 35, బీర 35, క్యాబేజి 18, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 33, దొండ 28, చిక్కుడు 45, గోకర 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 55, ఆలు 21, దోస 15, సొర 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 29, చామగడ్డ 40. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మలక్‌పేట రిటర్నింగ్ అధికారిగా వెంకట ఉపేందర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)గా హైదరాబాద్ అర్బన్ ల్యాండ్ సీలింగ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.వెంకట ఉపేందర్‌రెడ్డిని ఎన్నికల సంఘం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలు జరిగినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు కచ్చితంగా రాజకీయ నాయకులు పాటించాలని, లేని ఎడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివరాలను 99518 65584లో తెలియజేయాలన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

మలక్‌పేట: ఆర్యవైశ్య మహాసభ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. హిమాయత్‌నగర్ జోన్ డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని కోరారు. నిస్సాయులకు చేయూతను అందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కటకం శివకుమార్, కోశాధికారి ప్రకాశ్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు దయాకర్‌గుప్తా, వెంకటేశ్వర్లు, సత్యం, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. తెలంగాణకు పసుపు బోర్డు ప్రకటించినందుకు వారు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మార్కెట్‌లో అందరికీ నాయకులు మిఠాయిలు పంచారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మారెడ్డి, సుభాష్‌చందర్జీ, రాంకోటేశ్వరరావు, దినేష్, వంజరి వినోద్, చందూ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అంతర్గత రోడ్లు సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఫ్రెండ్స్‌కాలనీ వడ్డెరబస్తీలో సోమవారం కార్పొరేటర్ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పెండింగ్ పనులుపై దృష్టిసారించి వాటిని పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. డివిజన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, సిబ్బంది రాములు, సత్యనారాయణ, కాలనీవాసులు వైవీకే రెడ్డి, యాదిరెడ్డి, నర్సింహ్మగుప్తా, శ్రీకాంత్, సంతోష్, దినేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఉప్పల్: విజయపురి కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి బస్తీల్లో సోమవారం పర్యటించారు. కాంగ్రెస్ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్‌తోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో పనిచేసే పార్టీకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో దేవిరెడ్డి, రామకృష్ణ, తోకట రాజు, అనిల్‌కుమార్, లింగారెడ్డి, నారాయణ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఈగ బాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన సారూ.. స్పందించాలి మీరూ!

- ఇళ్ల మధ్య పేరుకుపోతున్న వ్యర్థాలు
- దుర్గంధంగా పరిసరాలు
- ఫిర్యాదు చేస్తున్న కాలనీలవాసులు
- విస్మరిస్తున్న అధికారులు



వనస్థలిపురం క్రాంతిహిల్స్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

హస్తినాపురం: కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల అవగాహన లోపంతో ఇళ్ల మధ్యనే చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ ఎల్‌బీ నగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం, వనస్థలిపురం, లింగోజిగూడ, చంపాపేట డివిజన్‌ల పరిధిలోని అనేక ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంకాలనీ, ఆదర్శనగర్‌కాలనీ, శ్రీరమణకాలనీలతో పాటు వనస్థలిపురం డివిజన్ క్రాంతిహిల్స్ కాలనీలో ఇళ్ల మధ్యనే గత సంవత్సరం కాలంగా చెత్త పేరుకుపోయినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణమా?

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి పనులు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం అలసత్వంతో మూన్నాళ్లకే శిథిలావస్థకు చేరుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు శాపంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. . విజయవాడ జాతీయ రహదారిపై సుష్మాథియేటర్ దగ్గర గత నెలలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతూ బస్టాప్ దగ్గర ప్రజలు డ్రైనేజీ దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు రోడ్డుపై నిలబడలేకపోతున్నారు. ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు మురుగు నీరు ఏరులై పారుతూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగించడంలో నిర్లక్ష్యం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కార్పొరేటర్ నిరసన దీక్ష



దీక్ష చేస్తున్న కాలనీవాసులు, కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా తదితరులు

చైతన్యపురి: సర్వీసు రోడ్లు ఆక్రమించుకున్న చిరువ్యాపారుల వల్ల కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నరిసింహగుప్తా కాలనీవాసులతో కలిసి సోమవారం నిరసన దీక్ష చేశారు. బీజేపి జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. చైతన్యపురి చౌరస్తా నుంచి కొత్తపేట చౌరస్తా వరకు పండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, రహదారులు ఆక్రమించుకోవటంతో సాయినగర్, ప్రభాత్‌నగర్, సత్యనారాయణ పురంకాలనీలలోకి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నా జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఉదయం 6 గంటల నుంచి కాలనీవాసులు దీక్ష చేస్తున్నా కనీసం జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలో చిరువ్యాపారులు, కాలనీవాసుల మధ్య వాగ్వాదం జరగంటతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంతో కాలంగా ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఎప్పుడూ లేనిది ఇప్పుడు మావల్ల ఇబ్బంది ఎందుకు వస్తుందని కాలనీవాసులను ప్రశ్నించారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జున ఇరువర్గాలకు నచ్చచెప్పి చిరువ్యాపారులను అక్కడ నుంచి పంపించి వేశారు.

- జీహెచ్‌ఎంసి, పోలీస్, ట్రాఫిక్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి కాలనీల ప్రజల సమస్యలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి, డీఈ నీలిమా హామీ ఇవ్వటంతో దీక్ష విరమింపజేశారు. దీక్షలో కాలనీవాసులు రాజగోపాల్, రామారావు, వెంకటరమణ,రాజిరెడ్డి, సిద్దేశ్వర్, వేణుగోపాలచారి. శివ వోజా నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రాచీన దేవాలయాలకు మహర్దశ



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో ప్రాచీన దేవాలయాలకు మహర్దశ సంతరించుకుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయానికి రూ. కోటి నిధులతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పురాతన దేవాలయాలకు రెండు విడతలుగా మంజూరైన రూ.8 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా యాదాద్రి టెంపుల్ ను పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, శ్రీధర్, అరవింద్ శర్మ, నగేష్, మహమ్మద్, శ్యామ్ గుప్తా, వెంకటేష్ గుప్త, లిక్కి ఊర్మిళ రెడ్డి, పటేల్ సునీత రెడ్డి, సుజాత రెడ్డి, మాధవి, అనురాధ, స్వప్న, పుష్పాలత, దుబ్బాక శేఖర్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

ఎల్‌బీనగర్: బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న చీరలను సోమవారం పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ ముద్దు లచ్చిరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారి శ్రీనివాస్‌గౌడ్, బలరాం, ఏఈ రాకేష్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పురుషోత్తంరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు పవన్‌రెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాన్షీరామ్ వర్ధంతి సభకు తరలిన బీఎస్పీ నేతలు

మలక్‌పేట: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతి సభకు సోమవారం మలక్‌పేట అధ్యక్షుడు ఆడపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మూసారంబాగ్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలివెళ్లారు. అంతకు ముందు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి.. నియోజకవర్గంలో బీఎస్‌పీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా మహిళా కన్వీనర్ ప్రసన్నయాదవ్, ఉపాధ్యక్షుడు అజార్ ఆలం, బీవీఎఫ్ కన్వీనర్ సుమన్, రాకేష్, నరేష్, శేఖర్, శివ పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో అభివృద్ధి పనులు షురూ

ఉప్పల్: చిలుకానగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.59.22 లక్షల అంచనా వ్యయంతో జలమండలి నిధుల ద్వారా చిలుకానగర్ బొడ్రాయి వద్ద, పోచమ్మ దేవాలయం, సాయిరాంనగర్ కాలనీ, సీవరేజ్ లైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్, ఏదుల కొండల్‌రెడ్డి, బాణాల నారాయణరెడ్డి, బింగి శ్రీనివాస్, అశోక్‌చారి, రవీందర్‌గౌడ్, అలిబిలి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


అమరవీరుల సంక్షేమాన్ని మ్యానిఫెస్టోలో చేర్చాలి

కాచిగూడ: తెలంగాణ అమరవీరుల సంక్షేమాన్ని అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసిన అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోవకపోవడం సరికాదన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. బీసీ మహాసభ నేతలు పులిజాల కృష్ణ, నల్లెల కిషోర్, ప్రదీప్‌గౌడ్, ముత్యాల్‌రావు, భూషణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అంబర్‌పేట్ : మతిస్థిమితం సరిగ్గాలేని ఓ యువతి అదృశ్యమైన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపునగర్‌లో నివసించే ఎం .వెంకటేష్ కుమార్తె రజిని (32) గత నెల 27న ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆయా ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మలక్‌పేట: విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నవీన్ తెలిపిన వివరాలు.. గడ్డిఅన్నారం చౌరస్తాలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర 30 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తి కరెంట్ షాక్ కొట్టి మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి తరలించారు. మృతుని వద్ద ఆధారాలు దొరకలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'నాసిరకంగా బతుకమ్మ చీరలు'



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: పండుగ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులకు పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి ఆరోపించారు. డివిజన్ పరిధి భవానీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం భవనంలో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇతర మతాలకు చెందిన వారందరికి కిట్లను పంపిణీ చేస్తారని, అదే హిందువుల మాత్రం రేషన్ కార్డు ఉంటేనే కిట్లను ఇస్తామనడం సరికాదన్నారు. హిందూ పండుగలంటే గులాబీ సర్కార్‌కు చిన్న చూపని అన్నారు. డివిజన్ పరిధి సుమారు 10 వేల చీరలు పంపిణీ చేయాల్సి ఉంటే కేవలం రెండు వేలు మాత్రమే వచ్చాయని అందజేయడంపై అధికారులకు నిలదీశారు. బతుకమ్మ చీరల పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, సిద్ధు పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గ



మాట్లాడుతున్న మేయర్ దుర్గ

మీర్‌పేట: పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందామని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అన్నారు. సోమవారం మేయర్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆయా డివిజన్లలో చేపట్టాల్సిన పనులపై కార్పొరేటర్లతో చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది కార్పొరేటర్లను సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, డీఈ గోపినాథ్, ఏఈ శ్రీనివాస్, ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, టీపీఓ దేవానంద్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు



- మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్
- వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో

రామంతాపూర్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో అవకతవకలు, అక్రమాలు జరిగాయని వెంటనే న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం రామంతాపూర్‌లోని హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్యకర్తలు, నేతలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు కాకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఇంతకు ముందే ఇళ్లు ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తున్నారని అన్నారు. చదువుకోలేని పేదలు ఇండ్ల కోసం పాత ఫోన్ నంబర్‌పై దరఖాస్తు చేసుకున్నారని, లాటరీలో ఇల్లు కేటాయించిన వారికి ఫోన్ కలవకపోతే పక్కనే పెట్టేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఇళ్ల కేటాయింపుపై న్యాయ విచారణ జరపాలని, లేదంటే తామే పేదల తరఫున ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు, డాక్టర్ శిల్పారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బాలచందర్, వెంకట్రావ్, నరసింహ, మంగా, సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

బాక్స్ డ్రెయిన్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్‌లో రెండో దశ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే డివిజన్ మొత్తంలో వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం అవుతుందని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఆఫీసర్స్ కాలనీలోని పార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రూ.6 కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించనున్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి శంకేశ్వరబజార్ చౌరస్తాలోని నాలా వరకు నిర్మించిన మొదటి దశ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం వల్ల సరూర్‌నగర్ చెరువు పరిసర కాలనీలకు వరద ముంపు సమస్య పరిష్కారమైందన్నారు. సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి జేఎస్‌ఆర్ స్విమ్మింగ్‌పూల్ వరకు రెండో దశ నిర్మాణ పనులు చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ డీఈ కార్తీక్ మాట్లాడుతూ.. వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిర్మించే ఈ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం 600 మీటర్లు పొడవు, రెండున్నర మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో పూర్తి ఆర్‌సీసీతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణంపై అభ్యంతరం

అధికారులపై అడిషనల్ డీసీపీకి ఫిర్యాదు



అడిషనల్ డీసీపీకి ఫిర్యాదు చేసిన హనుమాన్ ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు

సైదాబాద్: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని హనుమాన్ దేవాలయ పరిరక్షణ కమిటి సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి అధికారులపై ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2020లో చంచల్‌గూడ నుంచి ఒవైసీ ఆస్పత్రి వరకు స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం మొదలుపెట్టారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ఆలయానికి ముందు నుంచి మాత్రమే నిర్మాణం ఉంటుందని ప్రాజెక్ట అధికారులు తెలిపారు. అయితే ఇప్పుడు నిర్మాణ పనులు గమనిస్తే బ్రిడ్జ్ నిర్మాణం ఆలయంపై నుంచి వెళ్తోందని తెలుస్తోందన్నారు. ఆలయంపై నుంచి రాకపోకలు సాగించడమేంటని భక్తులు అభ్యంతరం చెప్తున్నారని వారు తెలిపారు. బ్రిడ్జ్ నిర్మాణం ప్రతిపాదించిన, నిర్మాణం పర్యవేక్షిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు అడిషనల్ డీసీపీని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సహదేవ్‌యాదవ్, సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సుభాష్‌చందర్జీ, వీరేంద్రబాబు యాదవ్, వినయ్ కిషోర్, నిరంజన్ పాల్గొన్నారు.

మలక్‌పేటలో వాహనాల తనిఖీలు



వాహనాలు తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ జయరామ్

మలక్‌పేట: ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో సోమవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్ సిబ్బందితో కలిసి గడ్డిఅన్నారంలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు తనిఖీలు కొనసాగుతున్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎన్నికల నియామవళి ఉల్లఘించిన వాహనదారులపై చర్యలు తప్పవన్నారు. తనిఖీలలో డీఐ జయరామ్, ఎస్సై నవీన్, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ విజయం కోసం పనిచేయాలి



కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సింహారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతీ కార్యకర్త పనిచేయాలని పార్టీ సీనియర్ నేత చిగురింత నర్సింహారెడ్డి అన్నారు. జల్‌పల్లిలోని ముస్లింలు, దళితులకు ఆయన పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సిహారెడ్డి మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బస్తీలలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. ఎన్నికల ముందే వరాల జల్లు కురిపిస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రియాజ్, తన్వీర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణినగర్ ఫేజ్-1 నూతన కార్యవర్గం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ త్రివేణినగర్ కాలనీ ఫేజ్-1 నూతన కార్యవర్గానికి సోమవారం ఎన్నికలు నిర్వహించారు. 2వ సారి కాలనీ అధ్యక్షుడిగా గాదం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నివ్వగా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా మల్లేష్, ఓంప్రకాశ్, రవి, మోహన్, రాంచందర్, కార్యదర్శులుగా సత్యనారాయణ, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీరాములు, బోస్‌బాబు, వెంకటేష్‌గుప్తా, సలహాదారులుగా రాజేందర్, నగేశ్, దత్తు, నగేష్‌గౌడ్ ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్‌తోనే ముస్లింల అభ్యున్నతి

పార్టీ నేత కార్తీక్‌రెడ్డి

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్‌తోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమని బీఆర్‌ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహీన్‌నగర్‌లో ఆదివారం రాత్రి వివిధ పార్టీల కార్యకర్తల బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్తీక్ రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముస్లింలను నేటికీ ఓటు బ్యాంక్‌గానే చూస్తోందన్నారు. తుక్కుగూడలో ముస్లింలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తే.. బీజేపీ రేసులో ఉన్న నాయకుడు ధర్నాలు చేయడం ముస్లింలు గుర్తుంచుకోవాలన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ముస్లిం బస్తీలలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత మంత్రి సబితారెడ్డికే దక్కుతుందన్నారు. సయ్యద్ యూసుఫ్ పటేల్, ఎక్బాల్ బిన్ ఖలీఫా, అలీ పటేల్, షేక్ అఫ్జల్, సయ్యద్ హుస్సేన్, పర్వేజ్ పాల్గొన్నారు.